క్లుప్తంగా

సూపర్ స్టార్ కృష్ణ సేవలు ఆదర్శనీయం


దివంగత హీరో కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దివంగత సినీ హీరో సూపర్ స్టార్ కృష్ణ సినీరంగంతో పాటు సమాజానికీ ఎంతో సేవ చేశారని ప్రముఖ సినీ దర్శకుడు ముప్పలనేని శివ అన్నారు. దివంగత కృష్ణ ప్రథమ వర్ధంతి కార్యక్రమం బుధవారం కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివ మాట్లాడుతూ తాను దర్శకత్వం వహించిన తొలి సినిమాలో కృష్ణ హీరోగా నటించారని, తనని దర్శకునిగా ప్రోత్సహించిన ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. తాను సంపాదించిన దానిలో సగానికి పైగా చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికే ధారపోసిన కృష్ణ మృతి సినీరంగానికి తీరని లోటన్నారు. ఏపీ మెడికల్ బోర్డు సభ్యుడు దిరిశాల ప్రసాద్ మాట్లాడుతూ ఏలూరు ఎంపీగా ఉన్న కృష్ణ నగరానికి మినీ బైపాస్ తీసుకొచ్చి ట్రాఫిక్ సమస్యలను తీర్చారని గుర్తుచేశారు. భవిష్యత్‌లో ఏలూరు మినీ బైపాస్ రోడ్డుకు హీరో కృష్ణ పేరు పెట్టడానికి ఎమ్మెల్యే ఆళ్ల నాని ద్వారా కృషి చేస్తామని చెప్పారు. కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధి ఎండీ ఖాజావలీ మాట్లాడుతూ తెలుగు పరిశ్రమకు సినిమా స్కోప్, 70 ఎంఎం, డీటీఎస్ వంటి నూతన టెక్నాలజీని పరిచయం చేసింది హీరో కృష్ణేనని గుర్తుచేశారు. మహేష్ బాబు కృష్ణ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని దాతృత్వాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు ముప్పలనేని శివకు సూపర్ స్టార్ కృష్ణ విశిష్ట వ్యక్తి పురస్కారంతో సత్కరించారు. తొలుత స్థానిక తమ్మిలేరు ఏటిగట్టుపై ఉన్న సూపర్ స్టార్ కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశా రు. అంబికా సంస్థల డైరెక్టర్ అంబికా రాజా, శ్రీశ్రీ విద్యా సంస్థల అధినేత ఎంబీఎస్ శర్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు గూడూరి ప్రసాద్, కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు గుమ్మడి రవి కృష్ణ, కూచిపూడి వాసు, మహేష్ ఫ్యాన్స్ ప్రతినిధులు కె.నాని, జి.సైమన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు, గర్భిణులకు టీకాలు

ఏలూరు రూరల్: చిన్నపిల్లలు, గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాల ని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరా వు సూచించారు. బుధవారం గుడివాకలంక పీహెచ్‌సీలో నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పిల్లలకు సోకే పోలియో, క్షయ, ధనుర్వాతం , కంఠ సర్పి, కోరింత దగ్గు, నిమోనియా, పొంగు, రుబెల్లా తదితర వ్యాధుల నివారణకు టీకాలు వేయించాలన్నారు. డెంగీ, మలేరియా సీజనల్ వైరల్ ఫీవర్స్ సంక్రమించకుండా ప్రజలు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణమోహన్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌తో పాటు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

ఎమ్మెల్యే ఆళ్ల నాని


మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: పేదల సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 121వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం వన్‌టౌన్‌లోని 8వ డివిజన్‌లో ఆయన చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం సమకూర్చిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా అధికారం చేపట్టిన తొలి ఏడాది నుంచే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో అమలు చేస్తున్నారని, నేడు 90 శాతం హామీలను అమలు చేశారని వివరించారు. నవరత్నాల పేరుతో పేదల జీవితాలకు భరోసా కల్పించేందుకు ఆయన శక్తివంచన లేకుండా కృషి చేస్తుంటే టీడీపీ, చంద్రబాబు కుట్రలు చేస్తూ పేదలకు మంచి చేయకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు అండగా నిలవాలని ప్రజలను కోరారు. అవినీతికి తావులేకుండా నేరుగా ప్రజల ఖాతాల్లోకి సంక్షేమ లబ్ధి జమవుతోందని, సీఎం జగన్ పారదర్శకంగా పాలన చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు తన హయాంలో ఎందుకు సంక్షేమ పథకాలు అమలు చేయలేదని ప్రశ్నించారు. తొలుత కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పార్టీ నేతలు, కార్యకర్తలు నానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు ఉన్నారు.

కోఆప్షన్ సభ్యురాలిగా తాయారు


కోఆప్షన్ సభ్యురాలు తాయారుతో మేయర్ నూర్జహాన్, కార్పొరేటర్లు


ఎమ్మెల్యే నానిని కలిసిన కోఆప్షన్ సభ్యురాలు తాయారు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యురాలిగా కొంపల్లి తాయారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఏలూరు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ సర్వసభ్య ప్రత్యేక సమావేశం నగర మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన ఏర్పాటుచేశారు. కోఆప్షన్ సభ్యురాలిగా కొంపల్లి తాయారు పేరును కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్ ప్రతిపాదించగా కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల బలపరిచారు. తాయారు అభ్యర్థిత్వాన్ని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించడంతో మేయర్ నూర్జహాన్ ఆమెకు నియామక పత్రం అందజేశారు. నగర కోఆప్షన్ సభ్యురాలు గంపల బ్రహ్మవతి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీ భర్తీకి నగరపాలక సంస్థ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో మాజీ కౌన్సిలర్ కొంపల్లి తాయారు దరఖాస్తు చేశారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, నీతా జైన్, కార్పొరేటర్లు హాజరయ్యారు.

- ఎమ్మెల్యే ఆళ్ల నానిని శ్రీరామ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో కొంపల్లి తాయారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నగరాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే నాని తాయారుకు సూచించారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కృష్ణమాచార్యులు ఉన్నారు.

జగనన్నే మా నమ్మకం – వార్డుకు పోదాం


ఏలూరు టైన్ : సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న మైబాబు, నాయులు


ఏలూరు టైన్ : పార్టీ జెండాను ఆవిష్కరించిన పిల్లంగోళ్ల శ్రీదేవి, ఆరేపల్లి రాధిక


ఏలూరు రూరల్ : మల్కాపురంలో పథకాల వివరాల ఫ్లెక్సీని ఆవిష్కరించిన నాయకులు


ఏలూరు రూరల్ : మల్కాపురంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

ఏలూరు టౌన్: కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి పేదవాడికి సంక్షేమాన్ని అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఆంధ్రాకు ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా ముక్తకంఠంతో కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు అన్నారు. ఏలూరు 48, 49 డివిజన్ల పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా జగనన్నే మా నమ్మకం – వార్డుకు పోదాం అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మైబాబు తొలుత పార్టీ జెండాను, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. రాష్ట్రంలో పేదవర్గాలకు నాలుగున్నరేళ్ల కాలంలో రూ.2.46 లక్షల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా అందజేశారని మైబాబు తెలిపారు. టీడీపీ హయాంలో రూ.2.67 లక్షల కోట్లు అప్పులు చేసి ఎవరికీ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ఇవ్వలేకపోయారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవరకొండ శ్రీనివాస్, సున్నా స్వాతి శ్రీదేవి, క్లస్టర్-3 మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి, యువజన విభాగం అధ్యక్షుడు ఈదుపల్లి పవన్, మహిళా సమాఖ్య టూటౌన్ అధ్యక్షురాలు అమీనా అన్సారీ తదితరులున్నారు.

- కొమడవోలు ప్రాంతంలో ముఖ్యమంత్రిగా జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ ఆరేపల్లి రాధిక, క్లస్టర్-1 మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్‌వీ శివరావు, జేసీఎస్ క్లస్టర్-1 కన్వీనర్ మోటమర్రి సదానందం హాజరై పార్టీ జెండా, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో ప్రతి పేదవానికీ మేలు జరిగేలా పథకాలు అందజేస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యక్షురాలు రాధ, పార్టీ నాయకులు అప్పన్న, దుర్గారావు ఉన్నారు.

అభివృద్ధి చూసి ఆదరించండి

ఏలూరు రూరల్ : గ్రామంలో అభివృద్ధి చూసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం ఏలూరు రూరల్ మండలం మల్కాపురంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో కోట్ల రూపాయలు వెచ్చించి ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ క్లినిక్, ఓవర్‌హెడ్ ట్యాంక్, పైప్‌లైన్, సీసీ రోడ్లు, డ్రెయినేజీతో పాటు పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు రూ.15 లక్షల మండల పరిషత్ నిధులు సైతం గ్రామాభివృద్ధికి వెచ్చించామని వివరించారు. పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో మల్కాపురం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. సర్పంచ్ పత్యాల సునీత మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో రూ.21.13 కోట్లు గ్రామాభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. ఇందులో రూ.6.8 కోట్లు అభివృద్ధి పనులకు చేపట్టగా మిగిలిన రూ.14.33 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. సచివాలయ వద్ద ఏర్పాటుచేసిన పథకాల ఫ్లెక్సీని ప్రతిఒక్కరూ పరిశీలించాలని కోరారు. తొలుత నాయకులు పార్టీ జెండా ఎగరేసి, పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఉపసర్పంచ్ తూతా నిరంజన్, బొమ్మవరపు గోఖనేషు, గొర్రెల సాంబశివరావు, బత్తుల అప్పారావు, బెజవాడ రామారావు, కోమటిలంక సర్పంచ్ తెనాలి యోహాన్, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, కార్యదర్శి రవీంద్ర, వార్డు సభ్యులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు రాజనందిని ఎంపిక


రాజనందినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సెయింట్ థెరిస్సా పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి.రాజనందిని జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ కొండవీటి శాంతమ్మ తెలిపారు. బుధవారం స్థానిక సెయింట్ థెరిస్సా పాఠశాలలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఎయిడెడ్ పాఠశాలల నుంచి తొలిసారి జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికై రాజనందిని చరిత్ర సృష్టించిందన్నారు. మండల స్థాయి నుంచి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరిగిన పోటీల్లో కుమితి విభాగంలో ఆమె అత్యంత ప్రతిభ చూపిందని తెలిపారు. వచ్చే నెలలో ఢిల్లీలో జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీల్లో విజయం సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. పీఈటీ వై.మురళీకృష్ణమ్మ మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చూపిన 31 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. రాజనందిని ఎంపిక పాఠశాలకు గర్వకారణమన్నారు. రాజనందిని మాట్లాడుతూ తాను రెండో తరగతి నుంచే కరాటే పోటీల్లో పాల్గొంటున్నానని, తన తల్లిదండ్రులతో పాటు ప్రధానోపాధ్యాయురాలు, పీఈటీ, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతోనే తాను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యానని తెలిపింది. కార్యక్రమంలో రాజనందిని తల్లిదండ్రులు జి.సాయి సుధాకర్, సింధేర తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండా జీవితం ఆదర్శం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గిరిజన ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన స్వాతంత్య్ర సమరయోధుడు బిర్సా ముండా అని బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షురాలు వంకా కాంచనమాల తెలిపారు. బుధవారం భారతీయ జనతా పార్టీ జిల్లా గిరిజన మోర్చా ఆధ్వర్యంలో ప్రముఖ గిరిజన నాయకులు, స్వాతంత్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి ఏలూరు అశోకనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన గిరిజనుడు మొగిలి ఆది సుబ్బారావును ఘనంగా సన్మానించారు.

వైభవంగా భగినీ హస్తభోజనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శ్రీరామ్ నగర్ 6వ రోడ్డులో ఉన్న బ్రహ్మకుమారి సంస్థ కార్యాలయంలో రాజయోగిని బీకే లావణ్య ఆధ్వర్యంలో బుధవారం భగినీ హస్తభోజనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ సినీ దర్శకుడు ముప్పలనేని శివను లావణ్య సన్మానించారు. రెడ్డి అప్పలనాయుడు బ్రహ్మకుమారీస్‌లోని సమర్పిత టీచర్‌లకు దుస్తులు బహూకరించారు. వేణుగోపాల్ లునాని, దావుగోపాల్ లునాని, హరగోపాల్ లునాని, ఎంబీఎస్ శర్మ, కోనేరు సురేష్ బాబు, బీకే మమత, బీకే బిందు, బీకే ప్రసాద్, బీకే నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	38
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	28	కంద	52
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	28	కీరా దోస	44
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	40	అల్లం	120
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	23
క్యారెట్	20	పాలకూర	10
దొండకాయలు	44-64	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	45-55	గోంగూర	06
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణి	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకదదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

ఆత్మదీపం వర్షిప్ సెంటర్ ప్రారంభం


ఆత్మదీపం వర్షిప్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక గ్రీన్ సిటీ కెనాల్ రోడ్‌లో నిర్మించిన ఆత్మ దీపం వర్షిప్ సెంటర్‌ను బుధవారం పలువురు అతిథులు ప్రారంభించారు. తొలుత హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ దిలార్స్ చర్చ్ ప్రతినిధి రాజ్ ప్రకాష్ పాల్ ప్రత్యేక ప్రార్థనలు చేసి చర్చిని ప్రతిష్ఠించారు. ఆత్మ దీపం మందిరం పాస్టర్ మైఖేల్ జోసెఫ్ రాజాని అభినందిస్తూ చిన్న వయసులో మందిరాన్ని నిర్మించి విశ్వాసులను దేవుని మార్గంలో నడిపించడం దైవానుగ్రహమే అన్నారు. ఈ మందిరాన్ని కష్టాలలో బాధలలో ఉన్నవారికి ఆదరణ, ప్రేమ సమాధానంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. నిరాశ నిస్పృహలో ఉన్నవారికి శక్తిగల దేవుని వాక్యం ద్వారా బలపరచబడాలన్నారు. సంఘ విశ్వాసుల ఐక్యత ప్రార్థన సహకారం వల్ల ఇది జరిగిందని అన్నారు. పాస్టర్ మైఖేల్‌ని, మెర్లిన్‌ని ప్రత్యేకంగా అభినందించారు. పాస్టర్లు ఎబినేజర్ శాస్త్రి, ఏనోష్ కుమార్, ఫిన్ని అబ్రహాం, ప్రభు కిరణ్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఈ మందిరం ప్రభువు మహిమ, తేజస్సుతో నింపి అనేకమంది ఆశీర్వదించాలని అన్నారు. కార్యక్రమంలో ఆత్మ దీపం పరిచర్యల నిర్వాహకులు చెదలవాడ జ్ఞాన ప్రకాష్ పరిచర్యల నివేదికలు తెలిపారు. ప్రముఖ దైవజనులు రాజ్ ప్రకాష్ పాల్ సంఘ విశ్వాసుల గురించి ప్రార్థించారు. కార్యక్రమంలో నగరంలోని పలువురు క్రైస్తవులు, దైవజనులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.2.23 లక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పత్తేబాద నాలుగు గుళ్ల సెంటర్లోని కనకదుర్గమ్మవారి ఆలయంలో హుండీల ద్వారా రూ.2,23,343 ఆదాయం సమకూరింది. 91 రోజులకు ఈ మొత్తం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు తెలిపారు. దేవదాయ శాఖ ఏలూరు తనిఖీదారు బి.లక్ష్మీ నరసింహారావు పర్యవేక్షణలో బుధవారం నిర్వహించిన ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ట్రస్టీబోర్డు చైర్మన్ బీహెచ్ రామ నాగశంకర్, ట్రస్టీలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న కమ్మ శివరామ కృష్ణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రెండో రోజు పలు కార్యక్రమాలు నిర్వహించారు. పుస్తక ప్రదర్శనను ఉదయం 10 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టీఎం ధనుంజయరావు, చలసాని సురేంద్ర ప్రారంభించారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సుకు టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షుడు కమ్మ శివరామకృష్ణ అధ్యక్షత వహించారు. సమాచార హక్కు చట్టం వినియోగంపై ఎస్.గణపతి రాజు, బి.దుర్గాప్రసాద్, ఎస్‌వీవీ సత్యనారాయణ, బీవీఆర్ చౌదరి, బీవీవీ నరసింహరావు, ఎ.శ్రీనివాసరావు, ఎస్‌వీ సత్యనారాయణ, ఎం యుగంధర్ శ్రీనివాస్, పుట్టా కుమార్ మాట్లాడారు. మధ్యాహ్నం 2 గంటలకు గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంపిక మీదే అనే అంశంపై ఆధ్యాత్మిక క్విజ్ గరికపాటి కాళిదాసు, మైలవరపు గురుశర్మ నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పాఠకులు, పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన

ఏలూరు రూరల్: పుస్తక పఠనం బాలబాలికల్లో ఆలోచన శక్తిని రేకెత్తిస్తుందని చాటపర్రు గ్రంథాలయ నిర్వాహకురాలు కె.వాసుకి అన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. ప్రతిరోజూ కనీసం రెండు గంటలు పుస్తకాలు చదవడం వల్ల పిల్లలు విషయ పరిజ్ఞానం పెంచుకోవచ్చని వాసుకి అన్నారు. పుస్తక ప్రదర్శనలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో బీకేఎంయూ మండల కార్యదర్శి పెంటయ్య, ఉపాధ్యాయకుడు తులసి, రామకృష్ణ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కమిటీ ఎన్నిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు ఏరియా ఏఐటీయూసీకి 19 మందితో నూతన కమిటీ ఎన్నికై ంది. బుధవారం స్థానిక స్ఫూర్తి భవనంలో ఏఐటీయూసీ ఏలూరు ఏరియా సమితి 21వ మహాసభ ఏఐటీయూసీ సీనియర్ నాయకులు కె.కృష్ణమాచార్యులు అధ్యక్షత వహించారు. నూతన కమిటీని ప్రకటించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బండి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా కె.కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షులుగా పుప్పాల కన్నబాబు, భజంత్రీ శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎ.అప్పలరాజు, సహాయ కార్యదర్శులుగా కె.ఆదినరేష్, వి.దత్తు, ఉద్యోగ కార్మిక సంఘాల నుంచి మరో 12 మందిని ఎన్నుకున్నారు. అతిథులు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఏలూరు జిల్లా ఏఐటీయూసీ ప్రథమ మహాసభను ఏలూరులో డిసెంబర్ 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కో కన్వీనర్ చాట్ల పుల్లారావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాసరావు సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి యు.హేమశంకర్ తదితరులు మాట్లాడారు.

మోసం, అత్యాచారంపై కేసు నమోదు

ఏలూరు టౌన్: వివాహితను బంధువుగా పరిచయం చేసుకుని, ఆమెను నమ్మించి బంగారు వస్తువులు, నగదును కాజేయటంతోపాటు, డబ్బులు ఇస్తానని లాడ్జికి రప్పించి అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. భీమడోలు మండలానికి చెందిన వివాహితకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. అదే మండలం పెదలింగంపాడు గ్రామానికి చెందిన కోనా మహేష్ అనే యువకుడు దూరపు బంధువునంటూ పరిచయం పెంచుకున్నాడు. తరుచూ ఆమె ఇంటికి వెళుతూ సాన్నిహిత్యంగా మెలుగుతూ బంగారం, డబ్బులను తీసుకున్నాడు. డబ్బులు ఇస్తానంటూ వన్‌టౌన్‌లోని శ్రీరామ లాడ్జికి రావాలని ఈ నెల 14న చెప్పడంతో ఆమె అక్కడకెళ్లింది. ఆపై అత్యాచారానికి పాల్పడటంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

యువకుడిపై కేసు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ పరిధిలో విద్యార్థిని వేధిస్తోన్న యువకునిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మారుతీనగర్ ప్రాంతానికి చెందిన విద్యార్థిని నగరంలో ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆమెను కామకోటి మహేష్ రోజూ వెంటపడుతూ ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలంటూ వేధింపులకు పాల్పడుతున్నాడు. ప్రేమించకపోతే ఆమె తల్లిదండ్రులను చంపేస్తానని కళాశాలకు వచ్చి గొడవ చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సీఐ ఎస్ రాజశేఖర్ దర్యాప్తు చేపట్టారు.